క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు సమాజాన్ని చైతన్యపర్చాలి



గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణ దిశగా విద్యార్థులు సమాజాన్ని చైతన్య పర్చాలని శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య పేర్కొన్నారు. లక్ష్మీపురంలో శ్రీచైతన్య స్కూల్ ఆధ్వర్యంలో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ చాటుతూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ అంతరించిపోతున్న అడవుల రక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధి గ్రీన్ ఇండియా మిషన్ లక్ష్యమన్నారు. ర్యాలీలో ప్రిన్సిపల్ ఎం.వినీత, కో–ఆర్డినేటర్ మూర్తి, డీన్ హరిబాబు, ఏవో శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివ పేటలోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థినులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఆనందబాబు, డాక్టర్ శనక్కాయల ఉదయ్ శంకర్, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పావులూరి రమేష్, కార్యదర్శి కె.సతీష్, కళాశాల పూర్వ ప్రిన్సిపల్ పి. సుధాకర్‌రావు, అధ్యాపకుడు ఎస్.శరత్ పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణ లీలలు ఆధ్యాత్మిక ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కల్యాణ మండపం వేదికపై నిర్వహిస్తున్న శ్రీమద్భాగవతం శ్రీకృష్ణలీలలు ప్రవచనం గురువారంతో ముగిసింది. తొలుత ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. మల్లాది కైలాసనాథ్ ప్రసంగిస్తూ శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని పైకెత్తి, అందర్ని దాని కింద ఉంచి కాపాడతాడని పేర్కొన్నారు. వారం రోజుల తర్వాత ఇంద్రుడు తప్పు తెలుసుకొని పశ్చాత్తాపడ్డాడని తెలిపారు. ప్రజలను విసిగించే వాడు అలసిపోవాల్సిందేనని, రక్షించే పరమాత్మకు అలసట ఉండదన్నారు. ప్రకృతి వైపరీత్యాలు తలెత్తినప్పుడు తమవంతు సహకారాన్ని అందించాలన్నారు.

ఆక్రమణలు తొలగించాలి




గుంటూరు మెడికల్: ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఆక్రమణదారుల పరిస్థితిపై బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ధార అంబేడ్కర్ గురువారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఫిరంగిపురం స్టేషన్ రోడ్డులో మురుగు కాల్వలపై ఆక్రమణదారులు నివాసం ఏర్పరచుకొని కొన్ని సంవత్సరాల నుంచి స్థానికులను పలు రకాలుగా ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో పవన్ కుమార్, వీరేశం గుప్తా, దాసరి జోజప్ప, భ్రమరాంబ, అంజన ఉన్నారు.

ఉచిత ఇసుక పేరిట దోపిడీకి తెరలేపిన కూటమి ప్రభుత్వం

పొన్నూరు: అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించి గద్దెనెక్కిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇసుక దోపిడీకి తెరలేపిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గేరా సుబ్బయ్య ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేయటం, అక్రమ కేసులు పెట్టడం ద్వారా సరికొత్త సంస్కృతికి తెరలేపారని అన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను ఏ విధంగా అమలు చేస్తారనే విధివిధానాలు ఇప్పటివరకు లేవని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నవరత్నాల పేరుతో పథకాలను అమలు పరిచారని గుర్తు చేశారు. ఇప్పటికైనా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై చేస్తున్న దాడులను ఆపి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని.. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

తల్లికి వందనం.. ఒకరికే ధనం

- అమ్మ ఒడికి దీటుగా పిల్లలందరికీ ప్రోత్సాహం అంటూ టీడీపీ ఎన్నికల ఆర్భాటం
- తాజాగా తల్లికే ఆర్థిక ప్రోత్సాహం పేరుతో మార్గదర్శకాలు జారీ
- ఇంట్లో ఎంత మంది విద్యార్థులున్నా ఒకరికే ఆర్థిక సాయం
- గుంటూరు నగరంలోని 505 పాఠశాలలు, లక్ష మంది విద్యార్థులు
- 30 వేల మంది ఇంటర్ విద్యార్థులు
- మొత్తం అందించాల్సిన సాయం రూ.195 కోట్లు



టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో సూపర్ సిక్స్‌లో స్కూల్‌కి వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని హామీ

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్నికల వాగ్దానాలు నిలబెట్టుకోవడం తమకు చేతకాదని టీడీపీ ప్రభుత్వం మరోసారి రుజువు చేసింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన జగనన్న అమ్మ ఒడి పథకానికి దీటుగా 'తల్లికి వందనం' అమలు చేస్తామని ఎన్నికల ప్రచారంలో ప్రగల్భాలు పలికి ఇప్పుడు ఇప్పుడు చేతులెత్తేసింది. అధికారంలోకి వస్తే ప్రతి ఇంట్లో చదువుకుంటున్న పిల్లలందరికీ 'తల్లికి వందనం' పథకం ద్వారా రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పిన ఎన్డీఏ కూటమి నేతల హామీ కోతలకే పరిమితమైంది. విద్యార్థులు ఎంత మంది ఉన్నా.. తల్లికే ఆర్థిక సహాయమంటూ సీఎం చంద్రబాబు మెలిక పెట్టారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలపై నీళ్లు చల్లారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న ముగ్గురు పిల్లలు ఉన్న కుటుంబానికి ఏడాదికి రూ.45వేలు ఇస్తానని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు పదే పదే చెప్పారు.

నాలుగేళ్లలో రూ.60వేలు ఆర్థిక సాయం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గుంటూరు నగర పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లులు నాలుగేళ్లలో రూ.60 వేలు లెక్కన ఆర్థిక ప్రోత్సాహాన్ని అందుకున్నారు. 2019–2020 విద్యా సంవత్సరం మొదలు ఇప్పటి వరకు ప్రతి ఏటా క్రమం తప్పకుండా గత ప్రభుత్వం అమ్మ ఒడి సాయం అందించింది. ఈ విధంగా నాలుగేళ్లలో 49,581 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.86.18 కోట్లు జమ చేసింది.

అందని సాయం..

గత ప్రభుత్వంలో జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా రూ.15వేలు చొప్పున ఆర్థిక ప్రోత్సాహం అందించారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థులు ఎటువంటి ఆంక్షలు లేకుండా ఆర్థిక సాయాన్ని పొందారు. మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి ఉంటే గత విద్యా సంవత్సరానికి సంబంధించిన ఐదో విడత అమ్మ ఒడి నిధులు జూన్ 21న తల్లు బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యుండేవి. ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఐదో విడత అమ్మఒడి ఆర్థిక ప్రోత్సాహం విషయంలో ఆశలు రేపి, ఆవిరి చేసింది.

1.30 లక్షల మందికి..

తల్లికి వందనం ద్వారా గుంటూరు నగర పరిధిలో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న 1.30 లక్షల మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.15వేలు చొప్పున ప్రభుత్వం రూ.195 కోట్లు అందించాల్సి ఉంది.

నగర అభివృద్ధికి సహకరించండి

కలెక్టర్‌కు మేయర్ విజ్ఞప్తి



కలెక్టర్ నాగలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మేయర్ కావటి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): నగర అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు కోరారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి మర్యాద పూర్వకంగా మేయర్ ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నాగలక్ష్మి 2015–17 మధ్య కాలంలో జీఎంసీ కమిషనర్‌గా విధులు నిర్వహించిన సమయంలో శివారు ప్రాంత అభివృద్ధికి దోహదపడ్డారన్నారు. నగరంలోని సమస్యలపై అవగాహన ఉందన్నారు. ఆమె మళ్లీ జిల్లా కలెక్టర్‌గా రావడం సంతోషమని పేర్కొన్నారు.

ట్రెక్కింగ్‌కు తీసుకెళ్లి నా కుమారుడ్ని హత్య చేశారు

- టీడీపీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి సుఖవాసి శ్రీనివాసరావు కుటుంబంపై చర్యలు తీసుకోవాలి
- మంత్రి లోకేష్ కు గంగూరి బాబూరావు దంపతుల వినతి



మంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందిస్తున్న బాబురావు దంపతులు

సాక్షి, అమరావతి: అమెరికాలో తన కుమారుడి మృతికి కారకులైన సుఖవాసి శ్రీనివాసరావుతో పాటు కుటుంబ సభ్యులపై చర్య తీసుకుని తనకు న్యాయం చేయాల్సిందిగా గుంటూరు నగర వాసి గంగూరి బాబురావు విజ్ఞప్తి చేశారు.. గురువారం తాడేపల్లిలోని నివాసంలో లోకేష్‌ను బాబురావు దంపతులు కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికాలో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోన్న తన కుమారుడు గంగూరి శ్రీనాథ్‌కు గుంటూరు నగర వాసైన టీడీపీ రాష్ట్ర కార్యనివాహక కార్యదర్శి సుఖవాసి శ్రీనివాసరావు కుమార్తె సాయి చరణిని ఇచ్చి 2016లో వివాహం చేశామన్నారు. ఆ తరువాత ఏడాది పాటు డిపెండెంట్ వీసాపై సాయి చరణి అమెరికా వెళ్లిందని తెలిపారు. కొద్దిరోజులు భార్యాభర్తలిరువురూ అన్యోన్యంగా ఉన్నారని, ఆ తరువాత తన కుమారుడిని కోడలు చరణి మానసికంగా వేధించటం ప్రారంభించిందన్నారు. పిల్లల గురించి ప్రస్తావిస్తే , పిల్లలు పుడితే తన అందం పోతుందని, తను సినిమాల్లో నటించాలనుకుంటున్నాను అని చెప్పేదని తెలిపారు.

మృతిపై అనుమానం..

2022 అక్టోబర్ 15 , 16 తేదీల్లో అమెరికాలోని అట్లాంటాలో భార్యభర్తలిద్దరూ కలిసి ట్రెక్కింగ్‌కు వెళ్లారని, 16వ తేదీన నా కోడలు గుంటూరులో ఉన్న తను ఫోన్ చేసి 'మీ అబ్బాయి చనిపోయాడు' అని చెప్పడంతో షాక్ కు గురయ్యామని బాబురావు వెల్లడించారు. శ్రీనాథ్ మృతదేహాన్ని గుంటూరు తీసుకురమ్మని కోరితే, మీరే ఇక్కడకు రండి అంటూ చెప్పి ఫోన్ కట్ చేసిందన్నారు. వియ్యంకుడైన సుఖవాసి శ్రీనివాస రావును తీసుకుని అమెరికా వెళ్లామని,. అక్కడకు వెళ్లిన తరువాత ఇంటిలోపలికి తమను అనుమతించలేదని, శ్రీనాథ్ ఎలా చనిపోయాడని కోడలిని అడగగా ట్రెక్కింగ్ కు వెళ్లి కాలు జారీ చనిపోయాడని చెప్పిందన్నారు. అమెరికాలోనే కుమారుడి అంత్యక్రియలు, కర్మకాండలు నిర్వహించి ఇంటికి వెళ్తే అప్పటికే కోడలు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయిందన్నారు. దీంతో కుమారుడి మరణంపై అనుమానం మొదలైందని వివరించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న సుఖవాసి శ్రీనివాస్‌తో పాటు టీడీపీ నాయకుడైన గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు ఇక్కడ గొడవలు, కేసులు ఎందుకు గుంటూరులో మాట్లాడుకుందాం' అని బెదిరించి వెనక్కు పంపేసారన్నారు. తన కుమారుడు మరణించిన తరువాత తమ కోడలు టీడీపీ నేత మన్నవ సుబ్బారావు బంధువుల నివాసంలో ఆశ్రయం పొందిందన్నారు.. తమ కొడుకు వస్తువులు కూడా తమకు ఇచ్చేందుకు వారు అంగీకరించలేదన్నారు.

పార్టీ పేరు చెప్పి బెదిరిస్తున్నారు..

తమకు న్యాయం చేయమని కోరేందుకు పలు మార్లు టీడీపీ రాష్ట్ర కార్యాలయానికి వస్తే పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి అశోక్‌బాబు, టీడీపీ నాయకురాలు సత్యవాణి తమను అడ్డగించి పార్టీ ముఖ్య నాయకులను కలవకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాము తప్పని సరి పరిస్థితుల్లో ఏపీ సీఐడీని ఆశ్రయించగా కేసు నమోదు చేశామన్నారు. కొడుకును పోగొట్టుకొని పుట్టెడు దుఃఖంలో ఉన్న తమను టీడీపీ నాయకుడు సుఖవాసి శ్రీనివాస్, తమది అధికార పార్టీ అంటూ పార్టీ పేరు చెప్పి బెదిరించడంతో పాటు ఇబ్బందులు పెడుతున్నాడని ఆరోపించారు. టీడీపీ నేత సుఖవాసి శ్రీనివాస్ బెదిరింపుల నుంచి కాపాడటంతో పాటు సీఐడీ కేసు విచారణ పాదర్శకంగా జరిగేలా చూడాలని మంత్రి లోకేష్ ను కోరారు. తప్పకుండా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని మంత్రి లోకేష్ హామీ ఇచ్చినట్లు బాబురావు తెలిపారు.

ఆస్తి కోసం మరిదిని కిడ్నాప్ చేసిన వదిన

గుంటూరు ఈస్ట్: ఓ వ్యక్తిని సమీప బంధువులు కిడ్నా చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యతిరాజుల కాలనీకి చెందిన బిల్లా గోపీకి 30 గజాల స్థలం ఉంది. వదిన నాగమణి స్థలం విషయమై గోపితో గొడవ పడుతుండేది. ఈ నెల 9న నాగమణి తన సమీప బంధువులు రమేష్, దేవి, నాగయ్యను వెంట తీసుకొచ్చి గోపి చేతులు కట్టి ఆటోలో ఎక్కించుకుని తన ఇంటికి తీసుకెళ్లింది. రూ.100ల స్టాంపు పేపర్లపై సంతకాలు పెట్టించుకుని వదిలి పెట్టారు. ఈ క్రమంలో గోపి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికులకు టెండర్ విధానాన్ని రద్దు చేయాలి

చేబ్రోలు: పంచాయతీ కార్మికులకు టెండర్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ కోరారు. చేబ్రోలు మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావుకు గురువారం గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ టెండర్ పేరుతో కార్మికులను ఇబ్బందులకు గురి చేయటం సరికాదన్నారు. బలవంతపు సంతకాలు పెట్టించటం, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించటం సరికాదన్నారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శివమ్మ, శారద, శ్రీను, హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న గ్యాస్ సిలిండర్ల లారీ



ఫిరంగిపురం: సీఎన్‌జీ గ్యాస్ సిలిండర్ల లారీ ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపల్లి నుంచి సీఎన్‌జీ గ్యాస్ సిలిండర్ల లారీ ప్రకాశం జిల్లా త్రిపురాంతకం వెళుతుండగా ప్రమాదవశాత్తు ఫిరంగిపురంలోని పోలీసు స్టేషన్ ఎదురుగా డివైడర్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో లారీ ముందు భాగం దెబ్బతింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం పొక్లెయిన్‌తో పక్కకు తీయించారు.

కాపుల అభ్యున్నతికి పథకాలను పునఃప్రారంభించాలి



ఎండీకి వినతిపత్రం అందజేత

నగరంపాలెం: టీడీపీ ప్రభుత్వం 2014–19లో కాపు, తెలగ, ఉపకులాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలగ అభ్యుదయ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు కాపు కార్పొరేషన్ ఎండీ కృష్ణమూర్తిని గురువారం వెలగపూడిలోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందించారు. గతంలో ప్రవేశపెట్టిన పథకాలను పునఃప్రారంభించి, కాపుల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. సంఘం కార్యదర్శి బాలిశెట్టి విజయ్‌కుమార్ మాట్లాడుతూ గుంటూరులో కాపు భవన నిర్మాణ పనులను చేపట్టేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కాపుల అభ్యున్నతికి ప్రజాగళం, ఎన్నికల మేనిఫెస్టోలో ఏటా రూ.3 వేల కోట్లు వెచ్చిస్తామనే హామీ అమలు చేస్తారనే నమ్మకం తమలో ఉందన్నారు. ఎండీని కలిసిన వారిలో చలపతిరావు, రేపల్లె నవీన్, కిరణ్, నరసింహారావు పాల్గొన్నారు.

జనాభా పెరుగుదలతో అనర్థాలు

లక్ష్మీపురం: జనాభా పెరుగుదల వల్ల జరిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్ పేటలోని సంస్థ కార్యాలయంలో గురువారం 'జనాభా నియంత్రణ – ప్రజలు – ప్రభుత్వాల బాధ్యత' అనే అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు టి.నారపరెడ్డి మాట్లాడుతూ రోజురోజుకు పెరిగిపోతున్న జనాభా వల్ల జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. జనాభా పెరుగుదలకు సంబంధించి ప్రజల్లో చైతన్యం కలిగించడానికి ఐక్యరాజ్యసమితి 1989లో దీనిని ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త ఎస్.రవిబాబు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

సమాజ సేవలో చలపతి టెక్ వింగ్స్ విద్యార్థులు



గుంటూరు రూరల్: విద్యార్థులు చిన్ననాటి నుంచి విద్యతోపాటు సమాజ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం నగర శివారులోని లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాల టెక్ వింగ్స్ అసోసియేషన్ విద్యార్థులు నగరంలోని పట్టాభిపురంలోని అనురాగ్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వృద్ధులు, అనాథలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు ప్రతి ఏటా నిర్వహించే సమాజ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహించటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కళాశాల సీఎస్‌ఈ విభాగాధిపతి డాక్టర్ ఎ బాలాజి, తదితరులు టెక్‌వింగ్స్ విద్యార్థులను అభినందించారు.

డ్రెయిన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



ఇంజినీరింగ్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

నెహ్రూ నగర్: సుదీర్ఘకాలం నుంచి పరిష్కారం కాకుండా ఉన్న మొండి గేటు వద్ద అవుట్ ఫాల్ డ్రెయిన్ రైల్వే క్రాసింగ్ పనులు వేగంగా చేపట్టడానికి జీఎంసీతో పాటు రైల్వే అధికారులు కూడా మరింత దృష్టి సారించాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ పేర్కొన్నారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక పాత గుంటూరు దగ్గరలోని మొండి గేటు రైల్వే ట్రాక్ వద్ద అవుట్ ఫాల్ డ్రెయిన్ క్రాసింగ్ అంశంపై జీఎంసీ ఇంజినీరింగ్, రైల్వే డివిజనల్ ఇంజినీర్లతో ఆయన సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నగరం నుంచి నాలుగు మీటర్ల అవుట్ ఫాల్ డ్రెయిన్ నుంచి వచ్చే మురుగు, వర్షపు నీరు ట్రాక్ కింద 1.5 మీటర్ల వెడల్పు నుంచి బయటికి వెళ్లలేక.. పాత గుంటూరులోని పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. దీని వల్ల పలు కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, రైల్వే ట్రాక్ మునిగి రైళ్ల రాకపోకలకు కూడా అంతరాయం కలుగుతుందని వివరించారు. నగరపాలక సంస్థతో పాటు రైల్వే అధికారులు కూడా సమస్య పరిష్కారానికి మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. రైల్వే నుంచి సమావేశానికి హాజరైన డివిజనల్ ఇంజినీర్ తమ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీవ్రతను వివరించాలన్నారు. నగరపాలక సంస్థ నుంచి కూడా రైల్వే అధికారులు తగిన వివరాలతో లేఖలు రాయాలని, కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్ర శేఖర్ దృష్టికి కూడా తీసుకెళ్తామని తెలిపారు. తదుపరి సమావేశం నాటికి సమస్య పరిష్కారానికి నిర్దిష్ట ప్రతిపాదనలు, టైం లైన్ కార్యాచరణ సిద్ధం అయ్యేలా రైల్వే, జీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జీఎంసీ ఎస్ఈ శ్యాం సుందర్, ఈఈ కోటేశ్వరరావు, రైల్వే డివిజనల్ ఇంజినీర్ సుదర్శన రెడ్డి, జీఎంసీ ఈఈఈ శ్రీధర్, ఏఈ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

సమాజ సేవలోనూ ముందుండాలి

ఘనంగా బీ ఫార్మసీ విద్యార్థుల ఫేర్‌వెల్ డే



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జూపూడి రంగరాజు

గుంటూరు ఎడ్యుకేషన్: బీ ఫార్మసీ పట్టభద్రులు ఔషధ రంగంతో పాటు జాతీయస్థాయిలో నిర్వహించే సివిల్స్ వంటి పోటీ పరీక్షల్లో సత్తా చాటి సమాజ సేవ చేయాలని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం బీ ఫార్మసీ చివరి సంవత్సర విద్యార్థుల ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రంగరాజు మాట్లాడుతూ ఫార్మసీ పట్టభద్రులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం పీజీఈ సెట్, జీ ప్యాట్ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులను అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.సీతారామయ్య మాట్లాడుతూ బీ ఫార్మసీ విద్యార్థులు ఎం ఫార్మసీ చదవడం ద్వారా ఔషధ ఉత్పత్తి పరిశ్రమలతో పాటు బహుళజాతి ఔషధ సంస్థల్లో ఉన్నతమైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, అధ్యాపకులు ఎస్.విజయలక్ష్మి, డాక్టర్ పి.జవహర్‌బాబు పాల్గొన్నారు.

నీట్ పునఃనిర్వహణ.. విద్యార్థులకు శిక్ష



మాట్లాడుతున్న అసోసియేషన్ కన్వీనర్ మల్లేశ్వరరావు

లక్ష్మీపురం: నీట్ ప్రశ్న పత్రం లీక్ విషయంలో తిరిగి పరీక్ష నిర్వహించడం 23 లక్షల మంది విద్యార్థులకు శిక్ష వేయటమేనని, ప్రభుత్వం ఉదార వైఖరిని ప్రదర్శించి విద్యార్థులను మానసిక క్షోభ నుంచి రక్షించాలని పేరెంట్స్ అసోసియేషన్ కన్వీనర్ వీఎస్ఎస్ మల్లేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాయలంలో బుధవారం ఏర్పాటు చేసిన చర్చా వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీట్ ప్రశ్న పత్రాలు లీక్ కావడంతో నష్ట పోయిన విద్యార్థులకు రీ–టెస్టుకి చివరి అవకాశం ఇస్తామని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బెంచ్ వెల్లడించిందన్నారు. అయితే ఇది చివరి ఆప్షన్ మాత్రమేనని పేర్కొందన్నారు. రెండు మూడు కేంద్రాల్లో పేపర్ లీక్ అయినప్పుడు 23 లక్షల మందికి తిరిగి పరీక్ష పెట్టడం ఏ తప్పు చేయని వారికి శిక్షేనని, దీనిపై పునరాలోచించాలని కోరారు. పి.భావన్నారాయణ్, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి సంస్థ సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, సంస్థ సభ్యులు మాట్లాడారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వం నమోదు



ఉపాధ్యాయులతో ఎన్‌టీఏ సభ్యులు

గుంటూరు ఎడ్యుకేషన్: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం పాత గుంటూరులోని యాదవ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ ఖలీల్, ఎన్వీ జగదీష్ కుమార్ మాట్లాడుతూ నగర పరిధిలోని మున్సిపల్, ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎన్‌టీఏ ముందంజలో ఉందన్నారు. ఉపాధ్యాయులు తమ సమస్యలను సంఘాల దృష్టికి తీసుకువస్తే, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం మంగళదాస్ నగర్, వినోభా నగర్, వాసవీ నగర్, ఎల్‌బీ నగర్, పాత గుంటూరు ప్రాంతాల్లోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి జి.అంతోనిబాబు, అసోసియేట్ అధ్యక్షుడు వి.సతీష్‌కుమార్, నగర అధ్యక్షుడు వి. సాయి విశ్వనాథ్ పాల్గొన్నారు.

జనాభా పెరుగుదలతో ఆహార ధాన్యాల కొరత



అధ్యాపకుడు వెంకటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ వ్యాప్తంగా జనాభా పెరుగుదలతో ఆహార ధాన్యాల కొరత ఏర్పడుతోందని హిందూ కళాశాల పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు జి. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. యువజన సర్వీసుల శాఖ, స్టెప్–స్వశక్తి ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సదస్సును బ్రాడీ పేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ఎం.బోసుబాబు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 1997 నుంచి ప్రపంచ జనాభా లెక్కింపు ప్రారంభించబడిందని, జనాభా పెరుగుదల కారణంగా ప్రభావితమవుతున్న వివిధ రంగాలు, వనరుల గురించి వివరించారు. స్టెప్ మేనేజర్ బి.రాధిక మాట్లాడుతూ జనాభా పెరుగుదలను నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యలను తెలియజేశారు. సదస్సులో యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వి. వేణుగోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్ : వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై అరండల్ పేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శారదా కాలనీ 14వ లైనులో నివాసం ఉండే ఏల్చూరి ఏసు (30) ఆర్థిక సమస్యల కారణంగా ఈ నెల 8న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేశాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు అతనిని జీజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.